ప్రకృతి పరవశించెన్..

ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో జనమంతా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తరుణంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. భానుడు శాంతించాడు.. వరుణుడు కరుణించాడు.. గూడూరు ప్రాంతంలో గత 10 రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం నుంచే ఒక్కసారిగా మేఘావృతమై చిరుజల్లులు పడ్డాయి. దీనికితోడు చల్లటి గాలులు వీచడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో స్థానిక ప్రజలు చిరుజల్లుల్లో సేద తీరారు.

– చిల్లకూరు

దొరవారిసత్రం : మండలవ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. బుధవారం పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో జనం ఎండ తీవ్రత నుంచి కొంత ఉపశమనం పొందారు. డీవీ సత్రం, కుపారెడ్డిపాళెం, ఏకొల్లు, నెలబల్లి, మైలాంగం తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. వెదురుపట్టు, తల్లంపాడు, కమ్మకంద్రిగ, కొత్తకంద్రిగ, వేణుంబాకం, లింగంపాడు, తనియాలి తదితర గ్రామాల్లో వర్షం పడడంతో వరి పంటకు కాస్త ఊరట ఇచ్చిందని ఆయా ప్రాంతాల రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

సైదాపురం.. ఉపశమనం..

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో బుధవారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఉక్కపోతతో అల్లాడి జనానికి ఒక్కసారిగా వర్షం కురవడంతో కాస్త ఉపశమనం పొందారు. దీంతో సైదాపురం బస్టాండ్ నుంచి గ్రామానికి వెళ్లే మార్గంలో వర్షపునీరు నిల్వ ఉండడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులకు పడ్డారు.

చిట్టమూరు..చినుకుల జోరు..

చిట్టమూరు : మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. మొలకలపూడి, రామాపురం, చిల్లమూరు, బురదగల్లి, కొత్తపాళెం, కుమ్మరిపాళెం గ్రామాల్లో చినుకులు పడ్డాయి. చిల్లమూరు, రామాపురం గ్రామాల్లో మెట్ట ప్రాంతాల్లో సాగు చేస్తున్న మిరప పంట సాగు నీరు లేక ఎండిపోయే దశలో ఉండడంతో ఈ వర్షానికి పంట బాగ వస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ గ్రామాల్లో పుచ్చ పంట కూడా సాగు చేశారు. పుచ్చ పంటలో వర్షపు నీరు చేరితే కాయలు దెబ్బతింటాయని, మార్కెట్‌లో విక్రయాలు ఉండవని ఆందోళన చెందుతున్నారు.


చిల్లకూరులో కురుస్తున్న జోరువాన


రామాపురం: వర్షం కురవడంతో చిగురించిన మిరప పంట


సైదాపురం బస్టాండ్ వద్ద నిలిచిన వర్షపునీరు



దొరవారిసత్రంలో కురుస్తున్న వర్షం

క్లుప్తంగా

భూముల రీసర్వేపై అవగాహన


గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్

సూళ్లూరుపేట రూరల్ : ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నరసింహరావు తెలిపారు. మండల పరిధిలోని కుదిరి, కుదిరి తప్ప కంద్రిగ గ్రామాల్లో భూముల రీసర్వేపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల వరకు కుదిరి గ్రామంలో ప్రాథమిక పాఠశాల వద్ద భూముల రీసర్వే నిర్వహిస్తునట్లు తెలిపారు. గ్రామస్తులు రీసర్వేకు సహకరించాలని కోరారు. సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వేగంగా రక్త పరీక్షాకేంద్రం భవన నిర్మాణం


మొదలైన భవన పనులు

దొరవారిసత్రం : మండల కేంద్రమైన దొరవారిసత్రం పీహెచ్‌సీ ఆవరణలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రక్త పరీక్ష కేంద్రం భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వం రోగులకు అన్నీ రక్త పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలనే తలంపుతో అప్పటి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కృషితో రక్త పరీక్షా కేంద్రాన్ని మంజూరు చేయించారు. ఈ భవనం పూర్తయితే రక్త పరీక్షల కోసం పట్టణానికి వెళ్లే పని ఉండదు.

వెంకటేశ్వర ప్రసాద్ సేవలు అభినందనీయం


వీడ్కోలు సమావేశంలో ప్రసంగిస్తున్న ఉపాధ్యాయులు


చిట్టమూరు : ఉపాధ్యాయుడిగా ప్రస్థానాన్ని మొదలు పెట్టి ఎంఈఓ వరకు ఎదిగిన కరణం వెంకటేశ్వర ప్రసాద్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఎంఈఓ–2 వెంకటేశ్వర ప్రసాద్ పదవీ విరమణ వీడ్కోలు సభను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ వెంకటేశ్వర ప్రసాద్ 42 ఏళ్ల పాటు విద్యారంగంలో ఎనలేని సేవలు అందించారని తెలిపారు. ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, ఎంఈఓగా పదోన్నతులు పొంది వృత్తికే వన్నె తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, ఎంఈఓ బీవీ కృష్ణయ్య, హెచ్ఎం మీనాకుమారి, వైఎస్సార్‌సీపీ నేత దువ్వూరు శేషురెడ్డి, కోట, వాకాడు, నాయుడుపేట, సూళ్లూరుపేట మండలాల ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యా య సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కృషి


పెళ్లకూరు స్కూల్‌లో సభావేదికను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ గాలి రమేష్‌నాయుడు

పెళ్లకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు తనవంతు కృషి చేస్తామని మాజీ సర్పంచ్ గాలి రమేష్‌నాయుడు అన్నారు. బుధవారం పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన తల్లిదండ్రులు దివంగత గాలి మాధవనాయుడు, రాధమ్మ జ్ఞాపకార్థం సుమారు రూ.2 లక్షలు వ్యయంతో నిర్మించిన సభావేదికను రమేష్‌నాయుడు, జయప్రద దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తమవంతు సాయం అందించడానికి ముందుంటా అన్నారు. అనంతరం పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వర్ణముఖి సిస్టమ్ మాజీ చైర్మన్ పేరం రమేష్ నాయుడు, పి.మధునాయుడు, గాలి రాజేష్‌నాయుడు, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

సైదాపురం: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా క్యారమ్స్ పోటీలు


క్యారమ్స్ పోటీల్లో తలపడుతున్న సభ్యులు

గూడూరురూరల్: పట్టణంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో జరుగుతున్న క్యారమ్స్ పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. రెండు రోజులుగా ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన సుమారు 40 జట్లు పాల్గొన్నాయి. నిర్వాహకులు ప్రసన్న మాట్లాడుతూ క్యారమ్స్ పోటీల్లో ఏకాగ్రత ఎంతో అవసరమన్నారు. చిన్నతనంలోనే ఈ ఆటను నేర్చుకున్న ఎంతోమంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో పోటీ పడి రాణించిన సందర్భాలు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఇండోర్ గేమ్స్‌లో ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సుధాకర్, రవీంద్రరెడ్డి, వెంకట్రావ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 46.384 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 46.384 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1390, పిన్నేరుకాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తేసే వరకు పోరాటం


సైదాపురం : ఆందోళన చేస్తున్న దళితులు


నిరవధిక ధర్నా చేస్తున్న దళితులు

సైదాపురం: ఊటుకూరు దళితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారి భూములకు యాజమాన్య హక్కు కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ పోలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన సైదాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊటుకూరు సమీపంలో సర్వే నంబర్ 359, 356లో ప్రభుత్వ భూముల ఆక్రమణలను జిల్లా సర్వేయర్‌తో సర్వే చేయించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే దళితులపై అక్రమ కేసులు, వేధింపులు, భూఆక్రమణలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఊటుకూరు సమీపంలో మైనింగ్ లీజు ముగియడంతో ఆ భూమిలో నిరుపేదలు చెట్లను తొలగిస్తుండగా.. పోలీసులు దళితులను భయభ్రాంతులకు గురి చేసి, అక్రమంగా కేసులు నమోదు చేశారని ఆయన ఆరోపించారు. ఈ కేసులు ఎత్తి వేసే వరకు నిరవధికంగా ధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం వారు తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో రమేష్, వెంకటయ్య, మమత, కోటయ్య, అంకయ్య తదితరులు ఉన్నారు.

పోషణలోపంతో శిశు మరణాలు


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దానియల్‌రాజు


మాట్లాడుతున్న సూపర్‌వైజర్

ఓజిలి: మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచే పౌష్టికాహారం తీసుకుంటే జన్మించే శిశువు ఆరోగ్యవంతంగా పుడతారని సీడీపీఓ ఉమామహేశ్వరి తెలిపారు. బుధవారం ఓజిలి ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డానియల్‌రాజు మాట్లాడుతూ చాలామంది పిల్లలు పుట్టుకతోనే లోపపోషణకు గురై మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ఇలాంటి పిల్లలను గుర్తించి ఆస్పత్రికి పంపితే పరీక్షలు నిర్వహించి తిరుపతిలో ఎన్ఆర్‌సీ కేంద్రానికి పంపుతామని తెలిపారు. ప్రతి తల్లి పిల్లల పెరుగుదల గురించి అంగన్‌వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకోవాలని తెలియజేశారు. సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం: పోషక విలువలపై గర్భిణులకు అవగాహన అవసరమని రాపూరు ప్రాజెక్ట్ సైదాపురం సెక్టార్ సూపర్‌వైజర్ సౌజన్య సూచించారు. మండలంలోని రామసాగరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పోక్షోత్సవాలను నిర్వహించారు..

రాపూరులో..

రాపూరు: పోషకాహారంపై గర్భిణులకు అవగాహన అవసరమని ఐసీడీఎస్ సీడీపీఓ రాజ్యలక్ష్మి సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని ఆకలివలస గ్రామంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు బాలసంజీవిని కిట్లు పంపిణీ చేశారు.

పోషకలోపం ఉన్న పిల్లలను గుర్తించాలి

వెంకటగిరి రూరల్: పోషక లోపం ఉన్న పిల్లను గుర్తించి పోషక విలువలపై అవగాహన కల్పించాలని సీడీపీఓ శంషాద్ బేగం సూచించారు. పట్టణంలోని ఐసీడీఎస్ క్లస్టర్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో బుధవారం పోషణ్‌పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎత్తు, బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంతో పాటు ఒబేసిటీ గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం


వివేకానంద రోడ్డులోని ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కోనేటిమిట్ట కోనేరులో స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న వేద పండితులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని వివేకానందరోడ్డులో ముఠా వర్కర్స్ కార్యాలయం వద్ద ఉన్న సీతారాముల ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏటా ముఠా వర్కర్లు తొమ్మిది రోజుల పాటు శ్రీరామ నవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. బుధవారం ఆలయంలో ముందుగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి.. అనంతరం సీతారాముల కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కమనీయంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కోనేటిమిట్టలో..

శ్రీరామనవమి బ్రహోత్సవాల్లో భాగంగా చివరి రోజున పట్టణంలోని కోనేటి మిట్టలోని కోదండరామాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి చక్రస్నానం క్రతువు నిర్వహించారు. ఆలయం ఎదురుగా ఉన్న కోనేరులో అర్చకులు స్వామివారి ఉత్సవ మూర్తులకు భక్తి శ్రద్ధలతో చక్రస్నానం చేయించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు డిగ్రీ విద్యార్థిని


శైలజను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

సూళ్లూరుపేట రూరల్: స్థానిక ఎస్‌వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకామ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న పి.శైలజ అనే విద్యార్థిని జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైందని ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎల్‌బీ శర్మ తెలిపారు. తమ కళాశాల విద్యార్థిని నెల్లూరులో ఉన్న విక్రమ్ యూనివర్సిటీ నుంచి ఇటీవల ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైందని తెలిపారు. కళాశాల అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్ అమ్మాజీ విద్యార్థినిని అభినందించారు.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం


మాట్లాడుతున్న మైనార్టీ విభాగం నాయకులు

గూడూరురూరల్: కేంద్రప్రభుత్వం కక్ష పూరితంగా వక్ఫ్ చట్టాన్ని సవరణ చేసిందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మగ్దూం మోహిద్దీన్ అన్నారు. పార్టీ మైనార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. కేంద్రప్రభుత్వం ముస్లిం ఆస్తులను కాజేసేందుకు ఇలాంటి సవరణ చట్టాలను వెలుగులోకి తీసుకుని వచ్చి ముస్లిం మనోభావాలపై దెబ్బకొడుతుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం పక్షాన నిలిచి సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేయడం అభినందనీయమని, ఆయనకు ముస్లింలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే అధికారంలో ఉన్న టీడీపీ, జనసేనలో సవరణ చట్టంపై కనీసం ప్రకటనలు కూడా చేయకపోవడంతో ముస్లింలపై వారికి ఎంతో ప్రేమ ఉందో అర్థం అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్‌మగ్దూం, షేక్ కాలేషా, అబ్దుల్లా, రఫీ, షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధిహామీ పనులు


ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న ఏపీఓ గిరిబాబు

చిల్లకూరు: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పనులను పారదర్శకంగా పూర్తి చేయించాలని ఉపాధి ఏపీఓ గిరిబాబు సూచించారు. బుధవారం ఆయన మండలకేంద్రంలోని ఉపాధిహామీ పథకం కార్యాలయంలో అన్ని పంచాయతీలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో చేపడుతున్న ఫారంపాండ్లు, పశువులకు నీటి తొట్టిల నిర్మాణంలో ఎక్కడా అలసత్వం లేకుండా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.

ఫారంపాండ్‌ల విషయంలో కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీని వల్ల సోషల్ ఆడిట్ జరిగే సమయంలో నష్టపోవాల్సి వస్తుందన్నారు. అలాగే పశువుల దాహార్తిని తీర్చేందుకు గ్రామ పొలిమేరల్లో నిర్మిస్తున్న తొట్టిలు ఇటుకలతోనే నిర్మించేలా చూడాలని అలా కాకుండా ఇష్టం వచ్చినట్లు నిర్మిస్తే బిల్లుల చెల్లింపులు ఆగిపోయి నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కూలీలకు పని ప్రాంతంలో దాతల సహకారంతో మజ్జిగ అందించేలా చూడాలని, నీడ కోసం టార్పాలిన్ పట్టలు ఏర్పాటు చేయాలన్నారు. సమీక్షలో ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొండను తవ్వి ఎలుకను పట్టారు

- రూ.4.50 లక్షలు మాత్రమే రికవరీ
- ప్రజావేదికలో పీడీని నిలదీసిన జాబ్‌కార్డుదారులు


ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

కోట: మండలంలో ఉపాధిహామీ పథకం అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడ్డారు. రూ.కోటి పైనే ప్రభుత్వ సొమ్ము దారి మళ్లినట్లు ఇటీవల గ్రామాల్లో జరిగిన సోషల్ ఆడిట్‌లో బహిర్గతమైంది. కానీ మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు కొందరిని కాపాడేందుకు ఏమీ జరగనట్లు చూపించారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్,ఏపీడీ వరప్రసాద్‌లు 2023–24 సంవత్సరానికి సంబంధించి మండలంలోని 21 పంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక నిర్వహించారు. గూడలి, చెందోడు, ఎస్‌పీ కొత్తపాళెం, ఉత్తమనెల్లూరు పంచాయతీల్లో సీసీ రోడ్లు, ప్లాంటేషన్, జంగిల్ క్లియరెన్స్ పనుల్లో అవినీతి వెలుగులోకి వచ్చింది. కానీ అధికారులు రెండు గంటల్లోనే ప్రజావేదికను ముగించారు. పీడీ మాట్లాడుతూ తప్పులను గుర్తించి రూ.4.50 లక్షలు రికవరీకి ఆదేశించామన్నారు. అదేవిధంగా ఇద్దరు టీఏలు భాస్కర్, శాంతిలను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఉపాధిహామీ పథకం ఏపీఓ పూర్ణిమ, సిబ్బంది ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆమెపై ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. ఏపీఓ పూర్ణిమపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. జాబ్ కార్డుదారులు ప్రజావేదిక వద్దకు వచ్చి ఏపీఓ అవినీతిపై పీడీకి ఫిర్యాదు చేశారు. పక్కా ఆధారాలతో అక్రమాలను బహిర్గతం చేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని మాట్లాడకుండా చేశారు. పీఆర్ ఏఈ కిరణ్, ఎస్ఆర్‌పీ రవి పాల్గొన్నారు.

రైళ్లలో సిలిండర్లు తీసుకెళ్లవద్దు


గూడూరు రైల్వేస్టేషన్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గూడూరురూరల్ : గూడూరు పట్టణ అగ్నిమాక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాక వారోత్సవాల్లో భాగంగా బుధవారం గూడూరు రైల్వే స్టేషన్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జ్ మాస్టర్ విజయకుమార్ మాట్లాడుతూ చిన్నపాటి అగ్ని ప్రమాదాలు జరిగినా ఎంతో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతుందన్నారు. రైళ్లలో పొరపాటున కూడా గ్యాస్ సిలిండర్లను తీసుకెళ్లడం చేయవద్దని సూచించారు. అలాగే కొంతమంది తీర్థయాత్రలకు వెళ్లే వారు చిన్న కిరోసిన్ స్టవ్‌లు తీసుకెళ్తుంటారని అలాంటి వాటి వల్ల పెద్ద ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

నాయుడుపేటటౌన్‌లో..

నాయుడుపేటటౌన్ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జ్ అధికారి డీవీ రమణయ్య ఆధ్వర్యంలో మేనకూరులోని పలు పరిశ్రమలు, పట్టణంలోని అపార్టుమెంట్‌ల వద్ద అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మసీ హెచ్ఆర్ (మెయిన్) ఉదయ్ కుమార్, హెచ్ఆర్ (అడ్మిన్)శ్యామ్ సుందర్ రెడ్డి, లీడింగ్ ఫైర్‌మెన్లు పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : వేసవికాలంలో అగ్ని ప్రమాదాలపై ప్రజలు జాగ్రత్తలు వహించాలని అగ్నిమాపక శాఖ అధికారి ఆదినారాయణ సూచించారు. బుధవారంపట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో గృహిణులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వంట చేసే సమయంలో మహిళలు గ్యాస్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే గ్యాస్ లీకేజీ కాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.


రాపూరులో..

రాపూరులో..

రాపూరు: వేసవికాలంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాపూరు అగ్నిమాపక అధికారి కుప్పయ్య సూచించారు. అగ్నిప్రమాదాల వారోత్సవాల్లో భాగంగా రాపూరు సిద్ధలయ్య సెంటర్ వద్ద బుధవారం అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు


ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని పుదూరు గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. చిట్టమూరు మండలం కొక్కుపాళెం గ్రామానికి చెందిన కూలీలు వరి కోత పనులకు దొరవారిసత్రం మండలం వేణుంబాక గ్రామానికి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో పుదూరు వద్ద రోడ్డు పక్కన ఆపి ఉన్న ప్రైవేటు బస్సు నిలిపి ఉంచగా.. కూలీలతో వస్తున్న ఆటోను వెనుక వచ్చిన ఓ కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో నేరుగా ఆటో బస్సును ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ గిరితో పాటు అతని పక్కనే కూర్చున్న కూలీలు తీపలపూడి చెంగయ్య, కృష్ణయ్య, మాధవికి గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.